సాక్షి ప్రకాశం

ఆదివారం । 25 । ఆగస్టు । 2024



సిగ్గు.. సిగ్గు.. ఇసుక మేత

మార్కాపురంలో పచ్చ నేతలు ఇసుకను అడ్డం పెట్టుకుని అడ్డదిడ్డంగా దోచేస్తున్నారు. నాయకులు, దళారులు ధరలు పెంచేసి అమ్ముతున్నారు.

- 8లో..



కన్నీటి ప్రవాహం

దర్శి మండలంలో ఈతకు వెళ్లి సాగర్ కాలువలో ముగ్గురు గల్లంతయ్యారు. వారిలో ఒకరి మృతదేహం లభ్యమవగా, మిగిలిన ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
34.5/28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది.

..మ్..రెడీ..యాక్!

మరుగుదొడ్లో క్లిక్కు..తెచ్చింది కొత్త చిక్కు

'ఏం తమాషాగా ఉందా? స్కూళ్లలో మరుగుదొడ్లకు మేమెళ్లి ఫొటోలు తీయడమేంటి? ఈ నిర్ణయం సరైంది కాదు. తక్షణమే జీఓ వెనక్కితీసుకోవాలి '.. ఇదీ కూటమి ప్రభుత్వం కొత్త జీఓపై ప్రభుత్వ పాఠశాలల యాజమాన్య కమిటీ చైర్మన్ల ఆగ్రహం.

'స్కూళ్లలోమరుగుదొడ్ల ఫొటోలు తీసేందుకా మేము ఉద్యోగాలు చేస్తున్నది. అందుకోసం పట్టభద్రులు కావాలా?. మేమూ కష్టపడి చదివి, గ్రూప్–2 స్థాయిలో నిర్వహించిన పరీక్ష రాసి ఉద్యోగాలు పొందాం. మేమెందుకు ఆ పనిచేయాలి?'.. కొత్త బాధ్యతలపై సచివాలయ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ సెక్రటరీల మాటలివి.

- ఎస్ఎంసీ చైర్మన్లు, సచివాలయ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు కూటమి సర్కార్ షాక్
- పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత అప్పగింతపై గరంగరం
- ఫొటోల బాధ్యత నుంచి హెచ్ఎంలకు విముక్తి.. కొత్తగా సర్వే విధుల అప్పగింత
- కూటమి ప్రభుత్వం తాజా ఉత్తర్వులతో ఉపాధ్యాయుల బిక్కమొహం

కనిగిరి రూరల్:

కొత్తగా ఎన్నికైన ఎస్ఎంసీ (పాఠశాల యాజమాన్య కమిటీ) చైర్మన్లకు టీడీపీ–బీజేపీ–జనసేన కూటమి ప్రభుత్వం గట్టి షాకే ఇచ్చింది. జిల్లాలోని 2,341 పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతలను ఎస్ఎంసీ చైర్మన్లకు, సభ్యులకు అంటగట్టింది. వారంలో రెండ్రోజులు వారు ఈ పని చేయాలంటూ మిడ్ డే మీల్స్, సమగ్ర శిక్ష డైరెక్టర్ ఉత్తర్వులు జారి చేయడంపై ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యులు కారాలు మిరియాలు నూరుతున్నారు. ఫొటోలు తీసే బాధ్యత నుంచి ప్రధానోపాధ్యాయులను తప్పించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి కొత్తగా సర్వే విధులు పురమాయించడంతో 'మరో కొత్త తలనొప్పి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొన్నటి వరకు అలా..

గతంలో పాఠశాలల్లోని మరుగుదొడ్లు, వాష్ బేసిన్లు, యూరినల్స్ గదుల పరిశుభ్రతకు సంబంధించి ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఫొటోలు తీసి ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసే వారు. హెచ్ఎంలు అందుబాటులో లేని సమయంలో ఇతర టీచర్లు ఆ పని చేసే వారు. దీనిపై ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం తెలపగా.. నాడు ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ నేతలు స్వరం కలిపి రాద్ధాంతం చేసిన సంగతి విధితమే.

తాజా ఉత్వర్వులతో ఇలా..

రాష్ట్ర ప్రభుత్వం తాజా ఉత్తర్వుల ప్రకారం మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతను సోమ, గురువారాల్లో ఎడ్యుకేషన్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లకు అప్పగించారు. ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యులు బుధ, శుక్రవారాల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్‌చేయాలి. దీనిపై అటు సచివాలయ ఉద్యోగులు, ఇటు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు నిప్పులు చెరుగుతున్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కూడా తలలు పట్టుకుంటున్నారు. పాఠశాలకు వచ్చి ఫొటోలు తీయండి అని ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యులకు చెప్పలేక.. చెబితే వారు ఎలా స్పందిస్తారో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. రోజూ 13 అంశాలతో కూడిన సర్వే ఫార్మాట్‌ను పూర్తి చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలంటూ హెచ్ఎంలను ప్రభుత్వం ఆదేశించడంతో 'ఒక సమస్య నుంచి తప్పించి మరో సమస్యలో ఇరికించారు'అంటూ ఉపాధ్యాయ సంఘాలు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.



కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల



పాఠశాలలో మరుగుదొడ్లు

ఈ నిర్ణయంపై పునరాలోచించాలి



ఎస్ఎంసీ చైర్మన్లు, కమిటీ సభ్యులు పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోలు తీయాలంటూ విద్యాశాఖ అధికారులు తీసుకున్న నిర్ణయం సరైంది కాదు. ఈ విధానంపై ప్రభుత్వం పునరాలోచించాలి.

– పందిటి మోహన్, విద్యా కమిటీ చైర్మన్

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.359



ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలోని పొగాకు వేలం కేంద్రాల్లో శనివారం నిర్వహించిన వేలంలో కేజీ గరిష్ట రూ.359 పలికింది. ఆర్ఎం లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో 10,234 బేళ్లు రాగా, 8,862 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,372 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. ఒంగోలులోని రెండు కేంద్రాలు, వెల్లంపల్లి, కొండపి, టంగుటూరు కేంద్రాల్లో 139వ రోజు వేలం పాటకు 5,286 బేళ్లు రాగా, 4,621 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 665 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.359, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.320.65 పలికింది. కందుకూరు–1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి కేంద్రాల్లో 133వ రోజు వేలం పాటకు 4,948 బేళ్లు రాగా, 4,241 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 707 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.195, సరాసరి రూ.294.95 పలికింది.

మహిళా వైద్యులకు భద్రత కల్పించాలి



"మహిళా డాక్టర్లు ఆస్పత్రుల్లో ఎలాంటి రక్షణా లేని వాతావరణంలో పనిచేస్తున్నారనే విషయం కోల్‌కతా ఘటన తేటతెల్లం చేస్తోంది. ఈ ఘటనతో మహిళా వైద్యులు, మహిళా జూనియర్ డాక్టర్లు, నర్సులు అభద్రతా భావంతో పనిచేయాల్సి వస్తోంది. ఈ పరిణామాలతో వారంతా తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. ఈ ఒత్తిడి నుంచి వైద్యులు బయటపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వారికి రక్షణ కల్పించే దిశగా అందరూ ఆలోచన చేస్తారని భావిస్తున్నాను."

– డాక్టర్ సాయిసంతోష్ కుమార్, యూపీహెచ్, బాలాజీనగర్, ఒంగోలు



భద్రంగా ఉన్నామన్న భావన కల్పించాలి



"కోల్‌కతా సంఘటన జరిగి రోజులు గడుస్తున్నా.. ఇంకా నేరస్తులందరినీ పట్టుకోలేదు. వారు ఎవరైనా సరే, ఎంతటి వారైనా సరే.. కఠినంగా శిక్షించాలి. సాధ్యమైనంత త్వరగా ఆ పని పూర్తి చేయాలని కోరుకుంటున్నాం. మహిళా డాక్టర్ డ్యూటీ రూమ్‌లో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలి. హాస్పిటల్ ఆవరణలో సీసీ కెమేరా ఏర్పాటు చేసి మానిటరింగ్ చేయాలి. ప్రతి హాస్పిటల్లో పోలీస్ అవుట్ పోస్ట్ ఉండాలి. పోలీస్ సెక్యూరిటీ ఉండాలి. తాము భద్రంగా ఉన్నామన్న భావనతో డాక్టర్లు విధులు నిర్వహించేలా అవసరమైన చర్యలు చేపట్టాలి. నైట్ డ్యూటీ చేసే వారికి ప్రత్యేకంగా రక్షణ అవసరం."

– డాక్టర్ దారా జాయల్ సంధ్య, మెడికల్ ఆఫీసర్, మాతాశిశు వైద్యశాల, ఒంగోలు

ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కమిటీ ఎంపిక



ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కమిటీ సభ్యులు

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–19 జిల్లా కమిటీని స్థానిక ఇంటర్మీడియెట్ ప్రాంతీయ బోర్డు పర్యవేక్షణాధికారి కార్యాలయంలో శనివారం ఎంపిక చేశారు. ఇంటర్ విద్యాశాఖ జిల్లా అధికారి ఐ.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఎస్‌జీఎఫ్ అండర్–19 విభాగంలో జిల్లా జట్ల ఎంపికను పర్యవేక్షించే బాధ్యతలను నూతన కమిటీ చూడనుంది. నూతన కమిటీ కార్యదర్శిగా ఈ.చింపారెడ్డి (పర్చూరు జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్), అసిస్టెంట్ సెక్రటరీగా పి.శివశంకర్ (సింగరాయకొండ), కోశాధికారిగా బాపయ్యశెట్టి (వేటపాలెం)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీకి అధ్యక్షునిగా జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి, ఉపాధ్యక్షునిగా జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వ్యవహరిస్తారు. గౌరవ సలహాదారులుగా టి.సుబ్బారావు (కందుకూరు), ఎంవీ మురళీకృష్ణ (కంభం) వ్యవహరిస్తారు.

రేపు ప్రజా సమస్యల వేదిక రద్దు

ఒంగోలు సెంట్రల్: కృష్ణాష్టమి పండుగ సందర్భంగా సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ దామోదర్ తెలిపారు. జిల్లాలోని ప్రజలు గమనించి దూర ప్రాంతాల నుంచి జిల్లా ఎస్పీ కార్యాలయానికి రావద్దని ఒక ప్రకటనలో ఆయన కోరారు.

ఏకేయూ సీడీసీ డీన్‌గా డాక్టర్ సోమశేఖర్



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రకేసరి యూనివర్సిటీ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్‌గా ఏకేయూ హిస్టరీ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సోమశేఖర్‌ను నియమిస్తూ యూనివర్సిటీ వైస్ చాన్సిలర్ డీవీఆర్ మూర్తి శనివారం నియామకపత్రాన్ని అందించారు. ఉపకులపతి ఆదేశాల మేరకు డాక్టర్ సోమశేఖర్ నియామక ఉత్తర్వులను ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు జారీ చేశారు.

క్లుప్తంగా

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: బడి వయసు పిల్లలంతా కార్మికులుగా కాకుండా విద్యార్థులుగా బడిలో ఉండాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. శనివారం ప్రకాశం భవనంలో చైల్డ్ లేబర్ డ్రైవ్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రారంభమైన ప్రత్యేక డ్రైవ్‌ను విజయవంతం చేయాలన్నారు. చైల్డ్ లేబర్‌ను గుర్తిస్తే వెంటనే వారిని స్కూలుకు పంపేందుకు చర్యలు తీసుకోవాలని, ఆ మేరకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి బాల కార్మికులు లేని జిల్లాగా తయారు చేయాలన్నారు. పిల్లలను పనిలో చేర్చుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనిలో బాలల సంరక్షణ అధికారి దినేష్‌కుమార్, సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, డీఈఓ సుభద్ర, డీఎంహెచ్‌ఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి యువకుడు మృతి

మార్కాపురం: పురుగు మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సైదుబాబు తెలిపారు. పెద్దారవీడు మండలం పుచ్చకాయలపల్లి గ్రామానికి చెందిన బొందలపాటి వెంకటేశ్వర్లు(29) మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో నివాసముంటూ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తరచూ మద్యం సేవిస్తుండటంతో కుటుంబ సభ్యులు మందలించారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మళ్లీ మద్యం సేవించి ఇంటికి వెళ్లడంతో కుటుంబ సభ్యులు గద్దించారు. దీంతో ఆటో వద్దకు వచ్చి పురుగు మందు తాగి పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి గుంటూరులోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రిడ్జ్ వాల్‌ను ఢీకొన్న కారు

● ఇరువురికి గాయాలు



బ్రిడ్జ్ వాల్‌ను ఢీకొని నుజ్జయిన కారు

పామూరు: కాలువపై నిర్మించిన బ్రిడ్జ్ వాల్‌ను కారు ఢీకొని ముందుబాగం నుజ్జుకాగా ఇరువురికి గాయాలైన ఘటన శనివారం వేకువజామున పామూరు 565 జాతీయ రహదారిపై సీహెచ్‌సీ సమీపంలో చోటు చేసుకుంది. ఏఎస్సై ముల్లా తెలిపిన వివరాలు.. వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన వీరంరెడ్డి విష్ణుకుమార్ రెడ్డి పీటీపీ వర్కర్ జావేద్ అలితో కలిసి మార్టూరు వెళ్లి పని ముగించుకుని కారులో తిరిగి కడప వెళ్తున్నారు. ఈసందర్భంలో పామూరు వద్ద 565 జాతీయ రహదారిపై వైద్యశాలకు సమీపంలో కారుకు అడ్డంగా పశువులు ఒక్కసారిగా వచ్చాయి. వాటిని తప్పించబోగా కారు అదుపుతప్పి రోడ్డుమార్జిన్‌లో కాల్వపై నిర్మించిన వాల్‌ను బలంగా ఢీకొట్టింది. ఘటనలో కారు ముందు భాగం దెబ్బతినగా కారులో బెలూన్స్ తెరుచుకోవడంతో ప్రమాదం తప్పింది. వాహనాన్ని నడుపుతున్న విష్ణుకుమార్‌రెడ్డి కాళ్లకు, చేతులకు స్వల్ప గాయాలు కాగా పీటీపీ వర్కర్ జావేద్ అలికి నడుము, కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. స్థానిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం జావేద్ అలిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి తరలించారు. విష్ణుకుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ముల్లా తెలిపారు.



వైద్యులకు రక్షణ కల్పిస్తే ధైర్యంగా పని చేయగలరు

24 గంటలు వైద్య సేవలందించే వైద్యులకు రక్షణ అవసరం. కొన్ని సందర్భాల్లో మహిళా వైద్యులు వేధింపులకు గురవుతున్నారు. మహిళా వైద్యులు తమ విధులు ముగించుకొని రాత్రి వేళల్లో ఇంటి వెళ్తుంటారు. అలాంటప్పుడు వారిపై అఘాయిత్యాలు, దాడులు జరిగే అవకాశం ఉంది. పోలీసు శాఖ ద్వారా వైద్యులకు, వైద్యశాలలకు రక్షణ కల్పిస్తే ధైర్యంగా సేవలందించగలం.

-డాక్టర్ శివనాయక్,
సూపరింటెండెంట్, కంభం



సెక్యూరిటీ గార్డులను నియమించాలి

సింగరాయకొండ: ప్రభుత్వ ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం సొంత నిధులతో ఓ వృద్ధుడిని నియమించాము. ఆస్పత్రిలో రాత్రి పూట ఒక్కదానినే విధులు నిర్వహించాలి. ఆ సమయంలో ఇద్దరు విధుల్లో ఉండేలా సిబ్బందిని నియమించాలి. సమాచారం ఇస్తే తప్ప చాలా కాలంగా రాత్రిపూట పోలీసులు గస్తీకి రావడం లేదు. దయచేసి రక్షణ కల్పించండి.

-పి. రాణి, స్టాఫ్ నర్స్,
సింగరాయకొండ

సిగ్గు.. సిగ్గు.. ఇసుక మేత!

● మార్కాపురంలో ఉచిత ఇసుక టన్ను రూ. 1600 మాత్రమే అట..
● గత ప్రభుత్వంలో టన్ను రూ. 1250 కే అందజేత
● కొంటే కొను... లేదంటే లేదు అంటున్న పచ్చ మేతలు



ఇసుక తోలేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఇసుక

మార్కాపురం: నాడు ఇసుక పాలసీపై డ్రామాలకు తెరలేపిన టీడీపీ.. నేటి కూటమి ద్వారా అధికారం చేజిక్కించుకున్న తర్వాత ఇసుక ధరలు ఆకాశాన్ని అంటేలా చేసింది. దీనికి తోడు సరిపడనంత ఇసుక నిల్వలు లేకపోవడంతో భవన నిర్మాణ రంగం కుదేలవుతోంది. తాము అధికారంలోకి వస్తే ఇసుక ఉచితంగా ఇస్తామని కూటమి నేతలు చెప్పడంతో ప్రజలు వారిని నమ్మి గెలిపించారు. అయితే నేడు ఈ ధరలు చూసి గుండెలు బాదుకుంటున్నారు.

జేబులు నింపుకుంటున్న పెద్దలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రవాణా చార్జీలు కలిపి టన్ను రూ. 1250 మాత్రమే పలకడంతో కూటమి నేతలంతా అయ్యో.. అంటూ దీర్ఘాలు తీశారు. తమను గెలిపిస్తే ఉచిత ఇసుక ఇస్తామని చెప్పటంతో అంతా నమ్మారు. కానీ ప్రమాణ స్వీకారం చేయగానే గత ప్రభుత్వంలో డంప్ చేసిన ఇసుకను రోజుల వ్యవధిలో ఖాళీ చేసి జేబులు నింపుకున్నారు. ప్రస్తుతం మార్కాపురం పట్టణంలో పలు ప్రాంతాల్లో కూటమి నేతల కనుసన్నల్లో దళారులు రంగ ప్రవేశం చేసి ఇసుకను తమకు ఇష్టమొచ్చిన ధరలకు అమ్ముకుంటూ భవన నిర్మాణదారుల అవసరాలను సొమ్ము చేసుకుంటున్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లి, కడప జిల్లా చెన్నూరు, టంగుటూరు మండలంలోని చతుకుపాడు తదితర ప్రాంతాల నుంచి రాత్రిపూట ఇసుకను లోడింగ్ చేసుకుని తెల్లవారుజామున 4 గంటలకు మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డు, బోడపాడు రోడ్డు, ఎస్వీకేపీ కళాశాల వెనుక వైపు తదితర ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. టన్ను ఇసుక మార్కాపురం పట్టణానికి అయితే రూ. 1600, ఇతర ప్రాంతాలకైతే రూ. 1800 ప్రకారం విక్రయిస్తున్నారు. దీంతో ఇసుకను కొనేవారు కుయ్యో మొర్రో అంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ధర తక్కువగా ఉందని, టీడీపీ ప్రభుత్వంలో ఉచితం అంటే తాము బాడుగ చెల్లించి.. తెచ్చుకోవచ్చని అనుకున్నామని, ఇలా ఉంటుందని ఊహించలేదని వాపోతున్నారు.

అందరికీ వాటాలు

ఇసుక విక్రయంలో అమ్మకం దారుల నుంచి ఎవరి వాటాలు వారికి వెళ్ళిపోతున్నాయి. దీంతో అక్రమంగా అధిక ధరకు విక్రయిస్తున్నా.. సెబ్, పోలీస్, మైనింగ్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవటంలేదు.

ఇసుక కొరత తీర్చాలి



మార్కాపురం ప్రాంతంలో ఇసుక కొరత తీవ్రంగా ఉంది. ఈ విషయమై తాము సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రాలు కూడా ఇచ్చాం. ప్రస్తుతం దొరుకుతున్న ఇసుక ధర కూడా ఎక్కువగా ఉండటంతో అత్యవసరమైతే తప్ప ఎవరూ కొనడం లేదు. కొరత మూలంగా భవన నిర్మాణాలు ఆగిపోవడంతో కార్మికులు రోడ్డున పడ్డారు. ఉచిత ఇసుకపై ప్రభుత్వం సత్వరమే నిర్ణయం తీసుకోవాలి.

నాసరయ్య, సీపీఐ నాయకులు, మార్కాపురం

నత్త నడకన నిర్మాణాలు

మార్కాపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో వ్యక్తిగతంగా గృహాలు కట్టుకునేవారు ఇసుక కొరత మూలంగా సైలెంట్ అయిపోయారు. నత్తనడకన నిర్మాణాలు సాగుతున్నాయి. ఇసుక ధర తగ్గితే కట్టుకోవచ్చు అనే ఆలోచనతో ఉన్నారు. ప్లాస్టింగ్‌కు కావాల్సిన, కట్టుబడికి కావాల్సిన ఇసుక ధరలు వేరుగా ఉండటంతో పూర్తి స్థాయిలో సరఫరా లేక నిర్మాణాలు నత్తనడకతో పోటీ పడుతున్నాయి. ప్రభుత్వం ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకుని తెచ్చుకోవచ్చని చెప్పినప్పటికీ మార్కాపురం ప్రాంతంలో ఇసుక డంప్ లేకపోవటంతో ఒంగోలు లేదా నెల్లూరు జిల్లాల నుంచి ప్రయాసతో తెచ్చుకోవాల్సి వస్తోంది. దీంతో రవాణా చార్జీలు ఎక్కువ అవుతున్నాయి. గత ప్రభుత్వంలో మార్కాపురం మార్కెట్ యార్డులో ఇసుక డంప్ ఉండటంతో అక్కడికి వెళ్ళి ఇసుక తెచ్చుకునేవారు. ఇపుడు ఆ పరిస్థితి లేక ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం చతుకుపాడు నిల్వ కేంద్రం నుంచి ఇసుక తెస్తున్నారు. ఒక ట్రాక్టర్‌లో 5 టన్నులు మాత్రమే ఇసుక నింపుతారు. ఈ లెక్కన ట్రాక్టరు ఇసుక 8 వేల రూపాయలు పెట్టి కొనాల్సి వస్తోంది. అనధికార ఇసుక విక్రయాలపై విచారణ జరిపితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని సెబ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో ఎవరు ఉన్నా ఉపేక్షించమని.. ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్‌చేసుకుని అనంతరం తెచ్చుకోవచ్చని చెప్పారు.

ఆగిన టిప్పర్‌ను ఢీకొట్టిన బైక్

● అక్కడికక్కడే వ్యక్తి మృతి



మృతి చెందిన కాట్రగుంట కిశోర్‌కుమార్

పొదిలి రూరల్: బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి ప్రమాదవశాత్తూ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన పొదిలి మండలంలోని కాటూరివారిపాలెం సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. చీమకుర్తి నుంచి పొదిలి వైపు వస్తున్న టిప్పర్ కాటూరివారిపాలెం సమీపంలో నిలిచి ఉంది. అదే మార్గంలో బైక్‌పై వస్తున్న వ్యక్తి చీకటిలో టిప్పర్ కనిపించక వెనుక నుంచి ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడిని బాపట్ల జిల్లా పొన్నూరుకు చెందిన రియల్టర్ కాట్రగడ్డ కిశోర్ కుమార్(55)గా పోలీసులు గుర్తించారు.

26న ఖోఖో జిల్లా జట్ల ఎంపిక

కనిగిరి రూరల్: రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా(ప్రకాశం, బాపట్ల) సబ్ జూనియర్ బాలికల జట్ల ఎంపిక పోటీలు ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖోఖో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కర్‌రావు, కాశీ విశ్వనాథరెడ్డి తెలిపారు. జె.పంగులూరులోని ఎమ్మెస్సార్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు 2019 అక్టోబర్ తర్వాత జన్మించి ఉండాలని, ఎత్తు బరువు కలిపి 215 పాయింట్ల లోపు ఉండాలని స్పష్టం చేశారు. ముందుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

కన్నీటి ప్రవాహం!

● సాగర్ కాలువలో మునిగి ముగ్గురు యువకులు గల్లంతు
● ఒకరి మృతదేహం లభ్యం.. మరో ఇద్దరి కోసం గాలింపు
● మూడు గ్రామాల రైతు కుటుంబాల్లో విషాదం



లోకేష్‌రెడ్డి తండ్రిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి



సంఘటనా స్థలం వద్ద రోదిస్తున్న బంధువులు

దర్శి: వారు ముగ్గురూ ప్రాణస్నేహితులు. ఒకే పాఠశాలలో చదువుకున్నారు. ఊర్లో జరుగుతున్న శుభకార్యాల్లో పాల్గొనేందుకు వచ్చారు. సాగర్ కాలువలో సరదాగా ఈత కొడదామని వెళ్లారు.. అదుపు తప్పి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఒకరి మృతదేహం లభ్యం కాగా మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. దర్శి మండలంలోని కొర్లమడుగు వద్ద సాగర్ కాలువలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఈ ఘటన రైతు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాలు.. దర్శి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పోతిరెడ్డి దానియేల్‌రెడ్డి కుమారుడు లోకేష్‌రెడ్డి(19), కొర్లమడుగు గ్రామానికి చెందిన బత్తుల జయరామిరెడ్డి కుమారుడు మణికంఠారెడ్డి(18), లక్ష్మీపురం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి కుమారుడు చంద్‌కిరణ్‌రెడ్డి(18) ముగ్గురూ స్నేహితులు. వీరు రాజంపల్లి పాఠశాలలో కలిసి చదువుకున్నారు. ప్రాణ స్నేహితులు కూడా. లోకేష్‌రెడ్డి గౌతమి కళాశాలలో ఐటీఐ, మణికంఠారెడ్డి నూజివీడులో పాలిటెక్నిక్ డిప్లమో, చంద్‌కిరణ్‌రెడ్డి ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ ముగ్గురి కుటుంబాలకు వ్యవసాయమే జీవనాధారం. అందరూ పేద రైతులే. ఇదిలా ఉండగా స్వగ్రామాల్లో శుభకార్యాల్లో పాల్గొనేందుకు వచ్చిన ముగ్గురు స్నేహితులు శనివారం మధ్యాహ్నం కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. సాగర్ కాలువలో ఈత కొట్టాలని సరదా పడ్డారు. కొమర్లమడుగు వద్ద సాగర్ కాలువలో ఈతకొడుతున్న సమయంలో నీటి ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రైల్వే ట్రాక్ పనులు చేస్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. నీటిపై తేలియాడుతున్న లోకేష్‌రెడ్డి మృతదేహాన్ని స్థానికులు బయటకు తీశారు. సర్పంచ్ బట్టు రామారావుకు మృతదేహం ఫొటో పంపడంతో ఆయన వెంటనే లోకేష్ కుటుంబ సభ్యులకు తెలియజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మిగిలిన ఇద్దరి జాడ కోసం సాయంత్రం చీకటి పడే వరకు గాలించారు. కాలువ లాకుల వద్ద జాలీలు ఏర్పాటు చేశారు.

గ్రామాల్లో విషాద ఛాయలు

కాలువలో ఈతకు వెళ్లిన తమ పిల్లలు నీటిలో కొట్టుకుపోయారని తెలుసుకున్న ముగ్గురి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులు భారీ సంఖ్యలో సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. చేతికి అంది వచ్చిన కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపిస్తున్నారు. మిలిగిలిన ఇద్దరు ఏమై ఉంటారోనని వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ

దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాలను ఓదార్చారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. గాలింపు చర్యలను వేగవంతం చేయించారు. అండగా ఉంటానని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు.

అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



హాజరైన అధికారులు

ఒంగోలు అర్బన్: జిల్లా అభివృద్ధికి రాబోయే ఐదేళ్లకు సరిపడా అవసరమైన ప్రణాళికలు ఈ నెల చివరినాటికి శాఖల వారీగా సిద్ధం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లా ప్రణాళికలు రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయాల్సిన నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేయాలని సూచించారు. శనివారం ప్రకాశం భవనంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ప్రణాళికల సంసిద్ధతపై చర్చించారు. శాఖల వారీగా నిరంతరం ఉండే లక్ష్యాలను సాధించడంపై దృష్టి పెట్టేందుకే పరిమితం కావద్దని, జిల్లాలో ఉన్న అవసరాలు, స్థానిక యువతలో శక్తి సామర్థ్యాలు, మార్కెట్ అవసరాలు, నూతన ధోరణులను గమనించి ఆ దిశగా జిల్లా ప్రణాళికలను వైవిధ్యంగా రూపొందించాలన్నారు. ముఖ్యంగా వ్యవసాయం, అనుబంధ శాఖలు, పరిశ్రమలు, ప్రాజెక్టులు, గృహనిర్మాణాలు, పర్యాటకం, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్ అండ్‌బీ, రవాణా, విద్య, వైద్యం, సంక్షేమం, విద్యుత్, నైపుణ్యాభివృద్ధి శాఖలు సృజనాత్మకంగా ఆలోచించాలని చెప్పారు. జిల్లా నుంచి పంపే ప్రణాళికలు రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం విధానపరంగా నిర్ణయాలు తీసుకునేలా ఉండాలన్నారు. సమావేశంలో సీపీఓ వెంకటేశ్వర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డీజే డిష్యుం.. డిష్యుం

● పెళ్లిలో పలు గ్రామాల యువకుల మధ్య ఘర్షణ
● ఐదుగురికి గాయాలు
● మాడిమసైన మూడు ద్విచక్ర వాహనాలు



పొందూరు ఘటనలో పూర్తిగా దగ్ధమైన ద్విచక్రవాహనాలు

టంగుటూరు: సంతోషంగా జరగాల్సిన వివాహ వేడుక ఘర్షణకు దారితీసింది. మూడు వర్గాల మధ్య డీజే పాటల విషయంలో జరిగిన దాడి వల్ల ఐదుగురు యువకులకు గాయాలయ్యాయి. కాగా మూడు ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమైన ఘటన మండలంలోని పొందూరు శివారున శుక్రవారం అర్ధ రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పొందూరు గ్రామానికి చెందిన ఎం. హనుమంతురావు కుమారుడికి, ఒంగోలు గ్రామీణ మండలం సర్వేరెడ్డి పాలెంకు చెందిన యువతికి పెద్దలు వివాహం నిశ్చయించారు. శనివారం తెల్లవారుజామున వివాహం జరగాల్సి ఉండగా వధువుని శుక్రవారం రాత్రి గ్రామానికి తరలించారు. గ్రామ శివారు నుంచి ఊరేగింపుగా పెళ్లి మండపానికి పోతుండగా టంగుటూరు వాణి నగర్‌కు చెందిన 20 మంది బంధువులు, కొండపి మండలం వెన్నూరు గ్రామానికి చెందిన వరుడు బంధువులతో పాటు పొందూరులోని స్థానిక యువకుల మధ్య మధ్య డీజే పాటల వివాదంలో తలెత్తింది. ఈ క్రమంలో వారి మధ్య మొదట తోపులాట చోటు చేసుకోగా వివాదం ముదిరి ఘర్షణకు దారితీసింది. పెద్దలు సర్దిచెప్పినా ఉపయోగం లేకుండా పోయింది. టంగుటూరుకు చెందిన ఐదుగురు యువకులకు గాయాలు కాగా ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. మూడు ద్విచక్ర వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్సై నాగమల్లీశ్వరరావు ఘటనా స్థలానికి చెరుకొని పరిస్థిని సమీక్షించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గాయాలైన యువకులు ఆసుపత్రి నుంచి బయటకు వచ్చినట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

● ఎస్పీ ఏఆర్ దామోదర్



వివరాలు తెలుపుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు సెంట్రల్: సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఫోన్ పోయిన వెంటనే అందులో మనీ పే యాప్‌లు వెంటనే బ్లాక్ చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఎఆర్ దామోదర్ సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు సైబర్ క్రైమ్ గురించి పాటించాల్సిన జాగ్రత్తల గురించి శనివారం వివరించారు. అజాగ్రత్తగా లేదా దొంగతనం కారణంగా ఫోన్ పోగొట్టుకున్న తర్వాత అకౌంట్‌లో ఉన్న నగదును సైబర్ నేరగాళ్లు ఎలా దోచేస్తారో వివరించారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ వంటి రద్దీ ప్రాంతాల్లో కొందరు సైబర్ నెరగాళ్లు గ్యాంగ్‌గా ఏర్పడి మొబైల్స్, పర్స్‌లు కొట్టేస్తున్నారని చెప్పారు. వెంటనే మొబైల్ యాప్‌లో ఉన్న నగదును దోచేస్తున్నారని తెలిపారు. ఫోన్ ఎంతో విలువైనదని తప్పనిసరిగా కాపాడుకోవాలని కోరారు. ఫోన్‌లో ఎటువంటి పాస్‌వర్డ్ పెట్టుకోకూడదని, నగదు పే యాప్‌లకు ఈజీ పాస్ వర్డ్ పెట్టుకోవద్దని, డెబిట్ కార్డులను ఫొటో తీసి ఫోన్‌లో పెట్టుకోవద్దని తెలిపారు. పాస్ వర్డ్ మరచి పోతామనే ఉద్దేశంతో ఫోన్ వెనుక వైపు లేదా ఫోన్ బుక్‌లో రాసి ఉంచుకోవడం వంటివి చేయకూడదని చెప్పారు. మొబైల్ పోయిన వెంటనే ఫోన్ పే యాప్‌లకు, బ్యాంక్‌లకు ఫోన్ చేసి కార్డును తక్షణం బ్లాక్ చేయించుకోవాలని చెప్పారు. గూగుల్ పే యూజర్ అయితే 1-800-419-0157, ఫోన్ పే యూజర్స్: 0806-8727-374, పే టీఎం యూజర్స్: 0120-4456-456 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేసి యాప్‌లను బ్లాక్ చేయించుకోవాలని సూచించారు. పోయిన మొబైల్ గురించి సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు. విషయాన్ని కుటుంబ సభ్యులతో పాటు, స్నేహితులకు, ఇరుగు పొరుగు వారితో పంచుకుని సైబర్ క్రైమ్‌లను నిరోధించడానికి సహకరించాలని కోరారు.